


# నాన్న కాళ్ళు పడుతూ కథలల్లటం నేర్చుకున్నాను

**- చాగంటి తులసి**

ఒక ప్రఖ్యాత కథా రచయిత కుమార్తె అదే బాటలో నడిచి కథా రచయిత్రిగా పేరు తెచ్చుకోవడం ఎక్కడోగాని జరగదు. అలా ప్రసిద్ధురాలయిన చాగంటి తులసి తండ్రి చాగంటి సోమయాజులు వారసత్వాన్ని కొనసాగిస్తూ కథలే కాకుండా సాహిత్య వ్యాసాలు, ఏకాంకికలు, నవలికలు, కవితలు విస్తారంగా రాశారు. హిందీ, ఒరియా, ఇంగ్లీష్ భాషల నుంచి తెలుగులోకి ఆమె చేసిన అనువాదాలు ప్రామాణికమైనవిగా రాణించాయి. ఎన్నో తెలుగు కథలను హిందీలోకి అనువాదం చేసి ప్రముఖ హిందీ పత్రికల్లో ప్రచురించారు. 'చాసో' కూతురిగా గాక చాగంటి తులసిగా సొంత వ్యక్తిత్వాన్నీ, పేరును సముపార్జించుకున్న ఆమెతో ఇంటర్వ్యూ మీ కోసం..

**★ మీ బాల్యం గురించి చెప్పండి?**

నేను పుట్టింది విజయనగరంలో, చిన్నిపల్లి వీధిలో, చాసో ఇంట్లో, చాసో కూతురిగా! మా ఇంటి వరండాలో చాసో, నారాయణబాబు, రోణంకీ తదితరులు ఎన్నో విషయాలు చర్చించేవారు. అవన్నీ అర్థం కాకపోయినా తెలుగులో వాళ్లు ఆలపించే గేయాలు నా నోటికి వాటంతటవే వచ్చేసేవి. వాళ్లు షైరుకి వెళ్లిపోయేక వాళ్లని అనుకరిస్తూ ఆడుకుంటూనే పిల్లలం 'మరో ప్రపంచం మరో ప్రపంచం మరోప్రపంచం పిలిచింది, పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి..' పాడుకుంటూ మెట్లు ఎక్కుతూ దిగుతూ గేట్లోని ఆవరణంతా కదం తొక్కేవాళ్లం. అక్కడి గడ్డి మీద నడుస్తూ శ్రీరంగం నారాయణబాబు పాడినట్టు పాడటానికి ప్రయత్నిస్తూ 'నడవండి నడవండి నడవండి నామీంచి నడవండి గడ్డిపరకనూ గడ్డిపరకనూ..' అని గట్టిగా పాడేవాళ్లం. ఆరుద్రని




సన్మాన సభలో...

గుండ్రమొహం అనేదాన్ని. చాసో చిన్నాజీ కథని కూడబలుక్కుని చదివినట్టే ఆరుద్ర పిల్లికూన కథను ఎంతో ఇష్టపడి చదివేదాన్ని. చాసో 'చిన్నాజీ' కథా, నారాయణబాబు 'చిన్నా! నీ కళ్లు క్రైస్ట్ చైల్డ్ కళ్లు' అన్న గేయం మొదలయినవి నా మీద రాసినవే. నన్ను ఇంట్లో 'చిన్నా' అంటారు. మా బామ్మ పేరు తులసమ్మ. ఆవిడపేరే నా పేరు.

**★ కథలు అల్లడాన్ని ఎలా నేర్చుకున్నారు?**

క్రమంగా జ్ఞానం పెరుగుతున్న వయసులో 'ఎందుకు పారేస్తాను నాన్నా' 'రథయాత్ర' 'కుంకుడాకు' కథల్ని మళ్లీ మళ్లీ చదివేదాన్ని. చాసో కథల్ని చదువుతూనే సన్నివేశాన్ని, అందులో నాటకీయతతో ఆయా వ్యక్తుల స్వభావంతో పాటు ఊహలో చూడ్డం, ముందస్తుగానే కథలో తర్వాతిలా అవుతుంది.. అలా అవుతుందని తెలుసుకోవడం నేర్చుకున్నాను. ఈ ఊహల అల్లికని నేర్పింది చాసోనే. ఎప్పుడు, ఎలాగంటారా? రోజూ రాత్రి పందిరి మంచం మీద పడుకుని నాచేతా బాబీ (చాసోగారి పెద్దబ్బాయి బాపిరాజు) చేతా కాళ్లు పట్టించుకునేవాడు. ఇద్దరం రెండు కాళ్లని పంచుకుని తొక్కేవాళ్లం. అలా తొక్కడానికి మాకు లంచం - నాన్న చెప్పే కథలు. కథ ఆపగానే మా నడక ఠక్కుమని ఆగేది. రోజూ ఎన్నని చెబుతాడు? అప్పటికప్పుడు కల్పించి ఏవేవో తమాషా కథలు చెప్పేవాడు. మేమిద్దరమూ తక్కువ తిన్నామా? 'మాకు నిజం కథే కావాలి..' అని గోల చేసేవాళ్లం. నిజం కథ అంటే వాస్తవానికి దగ్గరదీ నమ్మడానికి వీలుగా ఉన్నదీ అని మా అర్థం. అచ్చమ్మబుచ్చమ్మ కథలు అడ్డదిడ్డంగా కల్పించి చెబితే ఊరుకునేవాళ్లం కాదు. 'బోల్తా కొట్టిద్దామని చూస్తున్నావు. కురిడీ తినిపించుదామనుకుంటున్నావు.. మాకక్కర్లేదు..' అని కాళ్లు తొక్కడం మానీసి నిల్చుండిపోయేవాళ్లం. అలా కాళ్లు పడుతూ కథలు వింటూ కథలల్లడం నేర్చుకుంటున్నాననిగాని ఊహాశాలిత్వాన్ని పెంచుకుంటున్నాననిగాని నాకు తెలీదు.

**★ తొలి కథ గురించి కొంచెం చెప్పండి?**

స్కైలార్క్ అనే పాఠం మా క్లాసు పుస్తకంలో ఉండేది. స్కైలార్క్ అంటే భరతపక్షి అని నాన్న చెప్పేడు. భరతపక్షి పేరుతో కథ రాసేను. నాన్నకీ, అ.న. మాస్టారికీ (పండిత అయలసోమయాజుల నరసింహశర్మగారు) నారాయణబాబుకి చదివి వినిపించాను. బాగుంది అన్నారు. నారాయణబాబుకి నేనంటే ముద్దు. నాన్న లేకుండా చూసి గంటస్తంభం దగ్గర మేడమీదున్న ఫోటో స్టూడియోకి తీసుకెళ్లీ ఫోటో తీయించి 'నాన్నకేం చెప్పకు. బాలలో నీ కథ, ఫోటో వచ్చాక వాడికే తెలుస్తుంది..' అని మద్రాసెల్లిపోయాడు. నేను నారాయణబాబు ఎలా చెపితే అలా చేసేదాన్ని. 'బాల' మాసపత్రికలో నా ఫోటోతో ఆ కథ అచ్చయింది. అదే నా మొదటి కథ. 1946 జులై 'బాల' పత్రిక బజారులోకి వచ్చాకగాని నాన్నకి ఈ విషయం తెలీదు. తర్వాత రాస్తున్నప్పుడు 'ఏదైనా పెర్ఫెక్ట్‌గా ఉండాలి' అని నాన్నంటే 'చిన్నపిల్ల, పెర్ఫెక్షనెలా వస్తుంది..' అని నారాయణబాబు అనేవాడు. 'నీ మొహం నీకేం తెలీదు. పెర్ఫెక్షన్ కోసం తాపత్రయపడ్డం నేర్పించొద్దూ..? రెండు కథలు అచ్చయిూ అవగానే తానో రాతగత్తెనని అహంభావం పెరిగిపోతుంది. తాను రాసిందే బ్రహ్మాండంగా ఉంది అదే రైటు అనుకుంటుంది. జ్ఞానం కలగజెయ్యాలి కాని అజ్ఞానాన్ని పెంచకూడదు' అన్నాడు నాన్న.

**★ రచయితగా ఎదిగేందుకు తోడ్పడిన పరిస్థితులు ఎలాంటివి?**

మా ఇల్లు ప్రముఖుల చర్చలతో ఎప్పుడూ సందడిగా ఉండేది. రెండోది పుస్తకాలు. ఏది చదవాలన్న మీమాంస లేదు. ఎందుకంటే అత్యుత్తమైనదని ఎంపిక చేసిన సాహిత్యమే మాకందుబాటులో ఉండేది. వాటినే చిన్నప్పట్నించి చదివాను. అదే నాదైన వ్యక్తిత్వం ఏర్పడ్డానికీ రచయితగా ఎదగడానికి, రచనలో మెళకువల్ని ఒట్టబట్టించుకోవడానికీ సాధనమైంది. అలాగే బాల్యంలో నామీద పడ్డవన్నీ ఉత్తమ ప్రభావాలే. సాహితీపరుల రాకపోకలు, భారతి వంటి పత్రికలు, ప్రపంచ భాషల్లోని సాహిత్యం.. నాన్న తిరుగుడు బల్లలోని పెంగ్విన్ పుస్తకాలు.. అన్నీ ఎదగడానికి తోడ్పడినవే.

**★ కథలంటే ఎలా ఉండాలనుకునేవారు, అభిప్రాయాలు ఒకప్పటికీ ఇప్పటికీ ఏమైనా మారాయా?**


చెప్పాను కదా, కథ కన్విన్సింగా ఉండాలని చిన్నప్పట్నుంచీ అనుకునేదాన్ని. వాస్తవానికి దూరంగా, భాషాడంబరంతోనో చమక్కుతోనో ఉన్నవి నచ్చేవి కాదు. ఇప్పటికీ అదే ధోరణి. ఉదాహరణకి నాకు తొలినుంచీ ఓ హెన్రీ కథలు నచ్చేవి కాదు. ముగింపులో ఓ తమాషా తప్ప మరింకేమీ లేదనిపిస్తుంది. జీవితాన్ని సునిశితంగా పరిశీలించి చిత్రించని కథలు నాకు పెద్దగా నచ్చవు. కథకు డైరెక్ట్ అప్రోచ్ ఉండాలి. కన్సీల్‌మెంటే ఆర్టు. ఉపోద్ఘాతాలూ, ఉపసంహారాలూ ఉండకూడదు. మనం ఏమీ చెప్పకూడదు, పాత్రల మాటల్లోంచీ వారి స్వభావాల లోంచి మనం చెప్పాలనుకున్నది వ్యక్తం కావాలి. మన అభిప్రాయాలని ఏ పాత్ర నోటంటా ఆ పాత్ర స్వభావానికి విరుద్ధంగా, అసహజంగా ఉపన్యాసం ఇప్పించకూడదు. ఇప్పుడొస్తున్న కథల్లో స్లయిసెస్ ఆఫ్ లైఫ్ తప్ప, ఓ ఆలోచనా ధోరణి, నడిపే తీరులో పట్టు ఉండనివే ఎక్కువ.

**★ మంచి కథలకు గీటురాయి ఏమిటి?**

'మీకు తెలిసిన, మీరెరిగిన జీవితంలోంచి కథ అల్లుకోవడానికి కావలసిన వస్తువుని ఎంపిక చేసుకోవాలి. అప్పుడు దానిని వాస్తవానికి దగ్గరగా నమ్మదగినదిగా రాయగలుగుతారు.. అనుభవాల పరిధి పెరుగుతున్న కొద్దీ అనేకానేక వైవిధ్యాలను లోతుగా అర్థం చేసుకుని మంచి రచనలు చేయగలరు..' అని నాన్న చెప్పేవారు.

## నచ్చినవి

సినిమా: సౌండ్ ఆఫ్ మ్యూజిక్
హీరో: ఎన్.టి. రామారావు
హీరోయిన్: సావిత్రి
గాయని: ఎమ్మెస్ సుబ్బులక్ష్మి
గాయకుడు: బాల మురళీ కృష్ణ
ప్రదేశం: మా ఇల్లు
ఆహారం: వెన్న-మీగడ
నవల: మాలపల్లి
కథ: ఎందుకు పారేస్తాను నాన్నా!
కథకుడు: గురజాడ అప్పారావు
స్నేహితురాలు: ఛాయా పద్మిని
బంధువు: మా మేనమామ కొడుకు-దామరాజు సుబ్బారావు
హాబీలు: హాయిగా నవ్వడం-నవ్వించడం. గొప్ప పుస్తకాలు చదవడం-చదివించడం.



పద్మశ్రీ సచ్చిదానంద రవుతురాయ్‌తో...

> *Tulasi's narrative is straightforward and engaging in its dramatic and descriptive modes, at times commingled with the elements of chronicle. And it is simple narrative that generates the plot and the chillingly Kafkaesque atmosphere.*
>
> **- prof Mukund. R. Dave.**

దాన్ననుసరించే నేను మా బ్రాహ్మణ లోగిళ్లలోని జీవిత వాస్తవికతలోంచి కథాకల్పనల అల్లిక సూత్రాన్ని అందుకున్నాను. కాలమాన పరిస్థితులూ సమస్యలు మారవచ్చు. మారతాయి. అది సహజం. అయినా మంచి రచనలు పాతపడవు. ఒకానొక సమయంలో, ఒకానొక పరిస్థితిలో ఎవరికో ఒకరికి ఈ రచనల్లో పాత్రో, సంభాషణో, ఏదో ఒకటి జ్ఞాపకానికి వస్తూ ఉంటుంది. నా దృష్టిలో సర్వోత్తమ రచనకు ఇదే గీటురాయి.

**★ కాలంతోపాటు కథ మారుతున్న తీరును పరిశీలిస్తున్నారా?**

కథ ఎప్పటికప్పుడు మారుతూనే ఉంది. రకరకాల వాదాలు వాటిలోనూ వచ్చి వెళ్లాయి.. ఒకప్పటి కథల్లో ఎయిడ్స్ లేదు, స్త్రీవాదం లేదు. హేతువాదులు, స్త్రీవాదులు, దళితవాదులూ ముస్లిమ్ మైనారిటీలు - ఇలా ఈమధ్య గొంతువిప్పి కలం పట్టి రాస్తున్న కథకుల కథలు వారివారి జీవిత వాస్తవికతల్లోంచి, స్వానుభవాల్లోంచి, తమకు తెలిసిన ఇతరుల అనుభవాల్లోంచి వస్తున్నవే. అందుకే ఆయా గొంతుకలు బలంగా వినిపిస్తున్నాయి. సమస్యల్ని పైపైన తడమటమే తప్ప, లోతుగా చిత్రించని కథలు కాల పరీక్షకు నిలబడవు. కథని చదివినప్పుడు రిలవెంట్‌గా అనిపించాలి. ఆధునిక ఆలోచనకు మెరుగులు పెట్టాలి. ఆనందంతో పాటు ప్రయోజనాన్నివ్వాలి. సిద్ధాంతం కోసం కథలో జీవితాన్ని చూపడం వల్ల అది కృతకంగా వస్తుంది. అదే జీవితంలో సిద్ధాంతాన్ని చూపిస్తే కథ సహజంగా ఉంటుంది, పదికాలాల పాటు నిలబడుతుంది. నిజమయిన రచయిత నిజాయితీగా నిర్భీతిగా రాస్తాడు.



దక్షిణ కొరియాలో...

**★ అనువాదాల గురించి చెప్పండి?**

అనువాదాలు చెయ్యాలంటే రెండు భాషల పలుకుబడులతో పరిచయం బాగా ఉండాలి. ఆయా సంస్కృతీసంప్రదాయాలు కూడా తెలియాలి. చెప్పే ధోరణిలోని ధారావేగాన్ని నిలుపుకోగలగాలి. అలా చెయ్యడం మూల రచయితకు న్యాయం చెయ్యడం. మూలరచనని ఆ మాతృభాష వాళ్లు చదివి ఎలా ఆనందించి స్పందిస్తారో అనువాద భాష పాఠకులూ చదివి అలా ఆనందించి స్పందించడానికి అనువుగా వాక్యాల్ని చిన్నవిగా చేసుకోవచ్చు. పురిపండా అప్పలస్వామిగారిదీ ఇదే అభిప్రాయం. ఉప్పల లక్ష్మణరావుగారు మూలంలోని మహావాక్యాన్ని ఉపవాక్యాలతో సహా ఎలా ఉన్నదాన్ని అలా కామాలతో సహా అదే పద్ధతిలో అనువదించాలని అన్నారు. ఆయనే నేననువదివదించిన సచ్చరవుతురాయ్ కథల అనువాదాన్ని చదివి 'వొడ్డి దేశపు వాసనారుచీ పోకుండా చదివించేటట్టు సహజంగా చేశారు' ని మెచ్చుకున్నారు.

**★ మీ వ్యక్తిగత జీవితం గురించి చెప్తారా?**

హైస్కూల్ చదువు తర్వాత మా పొలాలు చూసుకోవడానికి లచ్చమ్మపేట అనే పల్లెటూరు వెళ్లిపోయాం. దాంతో నాకు కాలేజీ చదువులేదు. ఇంటర్, బియ్యే ప్రైవేటుగా చదివాను. ఉస్మానియా యూనివర్సిటీలో హిందీ ఎమ్మే పూర్తిచేశాక ఒరిస్సాలో లెక్చరర్‌గా వృత్తిని చేపట్టాను. కటక్, బరంపురాల్లో దాదాపు ముప్ఫయ్యేళ్లు పనిచేశాను. లెక్చరర్‌గా రీడర్‌గా హాంకుక్ యూనివర్సిటీ సియోల్ (దక్షిణ కొరియా)లో గెస్ట్ ప్రొఫెసర్‌గా హిందీ బోధించాను. పదవీ విరమణ తర్వాత విజయనగరంలో స్థిరపడ్డాను. అమ్మకిప్పుడు 94సంవత్సరాలు. అందుకే ఆమెను వదిలి ఎక్కడికీ వెళ్లను. చిన్నప్పటినుంచి నా నిర్ణయాలు నావే. ఆ స్వతంత్రం, స్వేచ్ఛ మా ఇంట్లో ఉన్నాయి. రాజీపడే స్వభావం తక్కువ. నా పరిధిలో, నా దారిలో మనసుకు నచ్చినవారెవరూ తారసపడలేదు కనుక పెళ్లి చేసుకోలేదు. నాన్నకన్నా స్నేహితుడిగానే ఎక్కువ మెసిలిన మా నాన్న క్యాన్సర్ గురించి తెలిసిన క్షణం, సోదరుడు చాగంటి శంకర్ మరణ వార్త వినడం నా జీవితంలో అత్యంత విషాద సందర్భాలు.

– అరుణ పప్పు

నాకు నచ్చిన నా కథ

# స్వర్గారోహణ

- చాగంటి తులసి

ఆ పొద్దు పోలికి, దాని పెనిమిటి అప్పలకొండయ్యకి పెద్దజట్టీ అయిపోయింది. ఎంతో సంబరంతో ఉరుకులు పరుగుల మీద పోలి గుడిసెకొచ్చింది. గుడిసెలో అడుగెట్టీ ఎట్టడం అప్పల కొండయ్య అగ్గినా తగులుకున్నాడు.

తాను మురిపాలు పోయినట్టే పెనిమిటీ మురిసిపోతాడే అనుకుంది. కాని ఆడు ఇనా జట్టీ ఎట్టేస్తా డని కూసంతకూడా యోచన దానికి రాలేదు.

''గెంజినీళ్ళకి గతినేదు. ఏటి కొందో సైడు! ఎదవముకం ఎదవముకమూని!'' చిందులు తొక్కేడు అప్పల కొండయ్య.

''నానేఁవీ సొమ్మెట్టి కొనీనేదు. సొమ్మెట్టి కొనీడానికి నాకాడ ఏటుందని! సిల్లిగవ్వ నేదు! నా కాడా నేదు. నీకాడా నేదు. మన మీ జలములో కొనానేము. ఏదో అనా కలిసివొచ్చింది. పెద్దొమ్మగోరు పెతి నెలా రూపాయి సొప్పున ఇరక్కొట్టుకుంటామంటే ఒట్టుకొచ్చినాను. పది మాసాల్లో తీరు మానం అయిపోద్ది'' ఇవరాలు సెప్పబోయింది పోలి.

అప్పలకొండయ్య తిట్లు ఆపలేదు. వాడు గుడిసెకి రావడమే తిక్కరేగి వచ్చేడు. పొద్దుననగా పోయినవాడు ఇదిగో ఇప్పుడు గుడిసెకి తిరిగి వచ్చేడు. కాళ్ళు అరిగేటట్టు ఊరంతా తిరిగేడు. కాని కూలి ఎక్కడా పుట్టలేదు.

''ఎదవది! ఏ నాయాల ముకం సూసినానో సుట్టముక్కక్కూడా కరవైపోనాది. పాటుపడతానన్నా ఎపుడూ పన్లోకి పిల్నేదు.

అప్పలకొండయ్య పనిదొరక్కా, చుట్టముక్క లేకా, నకనకలాడే కడుపుతో సందేళకి ఇంటికొచ్చేడు. బ్రామ్మరింట్లో అంట్లు తోమడానికి వెళ్ళిన పెళ్ళాం ఇంకా రాలేదు. దాకల్ని వెతుక్కున్నాడు. ఏ దాక లోనూ, ఏ చట్టిలోనూ ఏటీనేదు. పోలి అగ్గేసినట్టు లేదు. రేతిరికన్నా అగ్గేస్తుందోలేదో! ఏటన్నా సేస్తాదో సెయ్యదో! ఉస్సురంటూ వాడు అరుగుమీద చతికిల్లా పడ్డాడు. గుంజకి అనుకున్నాడు.

పోలి చంకలో చంటాన్నేసుకుని, నెత్తిమీద సుమ్మపాత మీద తళతళా మెరిసిపోతున్న జర్మను సిల్వరు బిందెతో వచ్చింది.

చంటాణ్ణి దింపి బిందె అరుగుమీద పెట్టిందో లేదో అప్పలకొండయ్య తగులుకున్నాడు.

ఆ వేళ పార్వతమ్మగారు యథాలాపంగా వీధిని పోతున్న సామాన్ల దాన్ని కేకేయించింది. పాత గుడ్డలు పుచ్చుకుని ప్లాస్టిక్ సామాన్లు, జర్మన్ సిల్వర్ సామాన్లు యిచ్చే ఆ హిందుస్థాని దానితో గీసి గీసి బేరమాడి మొగుడి పేంట్లో మూడు, తన చీరలో రెండు యిచ్చి ఏదన్నా మంచి సామాను పుచ్చుకుందామనుకుంది. ఆవిడ చూపెట్టిన పాతబట్టలన్నిటికీ కలిపి ఏం రాదని తైతక్కలాడి ఆ హిందుస్థానీది మరో చీర వేస్తే జర్మను సిల్వరు బిందె యిస్తానంది. చేతు(్రాక పోయినా బిందె బాగున్నట్టు అనిపించి మరో పాత చీర దాని మొహాన్ని పారేసి పార్వతమ్మ బిందె పుచ్చేసుకుంది.

ఆఫీసు నుంచి వచ్చిన మొగుడూ, పురాణం నుంచి వచ్చి అత్తగారూ ఇద్దరూ చెరోవేపు నుంచి 'జర్మను సిల్వరు బిందెకొండం ఏమిటి? అప్రతిష్ఠ అప్రతిష్ఠ!' అనీ, అదేదో స్టెయిన్‌లెస్ స్టీల్ బిందన్నట్టు మురిసిపోయి కొనేసిందని వెక్కిరించి చీవాట్లు పెట్టేసరికి పార్వతమ్మకి మతి పోయింది. పాత బట్టలు పది రూపాయలు చెయ్యకపోతాయా అని పోలికి ఆశ చూపెట్టింది. ప్రతి నెలా జీతంలో రూపాయి చొప్పున తీసుకోవచ్చంది. వచ్చినమ్మకి వచ్చినంతా దక్కుడు అని పది రూపాయలకి బిందెని పోలికి యిస్తానంది.

పోలికి కొండందుకున్నట్లయింది. ఎంతో సంబరంతో బిందె వొట్టుకొని ఇంటి కాడ కొచ్చిందో నేదో జట్టీ అయిపోనాది.

అప్పలకొండయ్య తిట్లకి మాటకి మాట పోలి జవాబు చెప్తూనే ఉంది.

''ఏ(్రా నువ్వనేది! నా యిస్టం! అవు(్రా! నా యిస్టమే! నా కాయికస్టంతో నాను తెచ్చుకున్నాను. ఓ యబ్బ! నీ సొమ్మేదో తగలేసినట్టు ఏడుస్తావేం? నిన్ను కొనమని నానేమన్నా కాలుసుకు తిన్నానా? ఓ పాలన్నా నీతో సెప్పినానా? ఎప్పుడన్నా బిందె కావాలొరే అని అన్నానా? ఏదో అనా జతపడ్డాది కాబట్టి వొట్టుకొచ్చేను. ఎవుడి ఎదానన్నా పోస్తే ఏడాలి! ఎవుడికిరా ఎట్టినాను! మన కొంపకోసమే కొన్నాను''.

శివాలు ఎత్తుతున్నా పెనిమిటికి మాటకి మాటా జవాబు చెపుతూ రెచ్చిపోతున్న పోలిగొంతుకా గగ్గోలూ విని నర్సయ్య పరిగెట్టుకు వచ్చేడు. ''ముసిలోడూ ముసిల్దీ ఏరెల్లి పోనారే! ఈళ్ళీ పొద్దు కలడుతున్నారేంటి సెపమా!'' అనుకుంటూ వచ్చేడు.

''ఏ(్రా? ఏ(్రా? ఏటైనాది? ఏటే? ఏటైనాది?'' అని మధ్యలో దూరి తగూ తీర్చడానికి నిలుసునే సరికి ఇద్దరి కిద్దరూ సల్లపడ్డారు. మధ్యోడు ఎవుడున్నా ఏలెత్తి సూపెడితే ఇద్దరికీ నామర్దావే. ఎంత వొయసు మల్లినోడైనా ఆడెవడు సెప్పడానికని ఇద్దరికిద్దరూ నీలుగులు పోతారు! ఏట్నేదంటే ఏట్నేదన్నారు. ఆలుమగల కజ్జాల్లోకి వెళ్ళడం తనదే బుద్ధితక్కువ అనుకుంటూ నరసయ్య తల దించుకుని వచ్చిన తోవనే పోయేడు.

నర్సయ్య వెళ్ళేక పోలి మొగుణ్ణి పరకాయించి చూసింది. మొగుడు తిండీ తిప్పలూ నేకుండా ఉన్నాడన్న వైనం దాని కెరికైనాది. టీ సుక్కలన్నా కడుపల అడ్డాయో నేదో అని అనుకుంది. ఆడి కోపానికి, ఆ సిందులు తొక్కడానికి కారణం దానికి తెలిసినాది. దాని మనస్సు గిలగిల్లాడింది. పిల్లాణ్ణి చింకిపాత

మీద పడుకోబెట్టి పొయ్యి మీద ఉడుకు నీళ్ళకి కుండ ఎక్కించింది.

''ఏటో ఎదవ జలమ! గెంజినీళ్ళ నేక గిలగిల్లాడిపోవాల్సి వొస్తున్నాది. ఏ దేవుడికి కనికరం పుట్టడం నేదు. ఇప్పుడంటే తాము ముగ్గురే. తనూ, పెనిమిటీ, పిల్లాడు! మొన్నమొన్నటి వరకూ అత్తా మావా మరిదీ కుటుంబకం మొత్తం అంతా కలిసే వుండేవోరు. పెతిదినాము అగ్గి నేకుండానే తెల్లారేది. పస్తులు ఉండలేక ''పేనాలు పోతే బావుణ్ణు. ఈ నరకయాతనకన్నా'' అని ముసిలోడు గోలుమని ఏడుస్తూ ఉండేవాడు. ''ఏ జలమలో ఏటి సేసినామో! పేనాలు తేలిగ్గా పోతాయా? బగమంతుడు పిలుపెడతాడా?'' అని ముసిల్ది అనేది! ఆకలికి తోడు రోజూ జట్టీవే. సూసి సూసి మరిదేటనుకున్నాడో ఏటో తల్లినీ తండ్రినీ తీసుకుని ఏరెల్లిపోనాడు. తానే వాళ్ళ పోసాకం సూస్తానన్నాడు. జనం తగ్గి నోరు అన్నమాటేగానీ ఏటి నాబం! పెనిమిటికి పని లేదు. పస్తులు తప్పటం లేదు'' పోలి మనసులో అంతా తలపోసుకుంది.

ఉడుకు నీళ్లెట్టి మొగుణ్ణి పిలిసింది. పార్వతమ్మగారింటి కాడ నుంచి తెచ్చిన నూకలతో జావ కాచింది. ఏమాట కామాట సెప్పు కోవాలి. బియ్యం బాగుచేస్తే వచ్చే నూకల్ని తీసుకొమ్మని ఆవిడే యిచ్చేస్తుంది. ఆ తల్లి కనికారం ఉన్న తల్లే!



అప్పలకొండడు చల్లబడ్డాడు. ఉడుకుడుకు నీళ్ళతో వొళ్ళు కడుకున్నాడు. గుమ్మాని కడ్డంగా కూచుని దాకలో జావ జుర్రడం మొదలెట్టేడు.

పిల్లాడికి పాలిస్తూ పోలి గుంజ నానుకుని కూర్చుంది.

జర్మను సిల్వారు బిందమీద సగం వరకూ ఉన్న చెక్కుడు గుండ్రంగా బొట్లు పెట్టినట్లు వెండి బిళ్ళళ్ళా తళతళ్ళాడుతూ ఉన్నాది.

''నిజం చెప్పాలే! మనకెందుకేటీ బిందె?'' అని కొండడు సౌమ్యంగా పెళ్ళాంతో అన్నాడు.

''ఏనాటి నుండో దానిమీద బెమ ఉన్నాది. ఆయమ్మ ఇస్తానంది. వొట్టుకొచ్చినాను'' అని పోలి అంతకన్నా సౌమ్యంగా మొగుడితో చెప్పింది.

పోలికి పెనిమిటంటే వల్లమాలిన ప్రేమ. కొండడికీ పోలంటే వల్లమాలిన ప్రేమే! సొమ్మున్న వాళ్ళయితే ఆ ప్రేమ ఆదర్శవంతంగా అందరికీ ఆనేదే.

''ఆ బాబుగోరితో సెప్పి పార్వతమ్మ గోరు ఏ పనన్నా ఏయిస్తుందేమోనని అనుకున్నా. ఆ ముక్కే నేదు!''

''ఆరికి నాను సెప్పనేదంటావా? పెతి దినాము అడుగుతూనేఉన్నాను. ఆడు రావక్కర్లేదు. ఖాళీ వొస్తే నానే సెపుతాను అని బాబు గోరు సెపుతున్నారు. ఆడు వొచ్చే కూలి పోగొట్టుకుని మా ఇంటి చుట్టూతా తిరగక్కర్లేదు అని అన్నారు''.

''కూలే! ఈ పొద్దు ఎక్కడా పాటు దొరకేనేదు''

''సాటోళ్ళు రిక్సా తిప్పుకుని బతుకుతున్నారు''

''రిక్సా దొరకందే! సొంతం మాటెవుడెడిసేడు? అద్దెబండీవే దొరకనేదు''

''బళ్ళు యిస్తున్నారంటున్నారు. బేంకీల వోళ్ళు సొమ్ము యిస్తున్నారంటున్నోరు. ఏటో! మనకేటీ దొరకనేదు''

''మనకెనా దొరుకుతాయ్! ఏ బాబు ప్రాపో ఉంటేనే కాని ఏటీ దొరకవు! పిలిసి సేతుల్లో ఎవుడు ఎడ్తాడు! దానికీ తెలిసున్నోళ్ళు కావాల! పార్వతమ్మ గోరి బాబుతో సెప్పితేనో!''

''ఆబాబు సేతుల్లో ఏటన్నా ఉంటే సేసి పెట్టేవోడు కాదా?''

''నిజివే! మాన సావులిలా ఉంటే ఎవుడేటి సేస్తాడు?''

''ఒరేయి! కొండయ్యా!'' అంటూ ఎంకటసామి వచ్చేడు.

''దిగూ ఈదినో మనోళ్ళ కొంపలన్నీ నాగేసినారు'' అని చెప్పేడు.

''ఏటేటి! దిగూ ఈదా?''

''దిగూ ఈదే! నిన్నటి రేతిరంతా సెందిరీ దాని పిల్లా పాపా రోడ్డు మీనే జాగారం సేసినోరుట. ఎవురికి తిండీ తిప్పలు నేవుట, కుండా మండా ఒట్టుకుని ఈ పొద్దు ఈడకొచ్చినోరు''

''సెందిరీవోళ్ళూనా? అలాగైతే మా వోళ్లెటైపోనారోనో పోరీ! అయ్యావోళ్ళు దిగూ ఈదికే పోనారు''

''మీవోడున్న కొంపవరకూ బులుడోజరు రానేదుట! ఆళ్ళు బతికి పోనారు. మనపేటకీ ముప్పు వస్తోందిట. ఏటి సెయ్యాలో! ఎక్కడికి పోవాలో!''



అన్నాడు ఎంకటసామి.

''మన మేటి సేసినాము మన కొంపలు పీకడానికి!''

''సదును సేసుకుంటూ పోతున్నారు. మనమీద నుంచీ నాగేస్తే ఈసావు తప్పుతాది. దినదినామూ సవ్వన్నక్కర్నేదు''.

''బాగా సెప్పినావు ఎంకటసామీ! సస్తేనే హాయి! సొరగానికి పోవచ్చు'' అన్నాది పోలి.

''సస్తే సొరగమేనేటే? మనలోటోళ్ళకి సొరగం దొరుకుద్దా?'' అన్నాడు అప్పలకొండడు.

''బతికేటి అనుబగిస్తున్నోం! సెప్పారే! నరకఁవేగా!''

''నాకు తెలవకడుగుతానూ, ఏటొద్దు కొంపలు మనవి! వీట్ని పీకుతారేం? గొప్ప బాబులు కేటీ పని!''

''మన కొంపలు అసియ్యంగా ఉన్నాయట!''

''అసియ్యం అసియ్యం అంటే మనకీ మేడలేసి యిమ్మను''

''గెంజినీళ్ళకి గతినేదు! మావా! నీకు మేడలు కావాలా!'' అన్నాది పోలి.

''నాను కావాలంటం నేదు! ఆళ్ళు అసియ్యమంటున్నారంటే మేడలేసి యిమ్మంటున్నాను''

''మన గుడిసెలు ఆళ్ళని కురుపుల్లా సలుపుతూ బాదెడుతున్నాయట!''

''డాకటేరు కురుపుని కోసినట్లు బులుడోజరు గుడిసెల్ని చెక్కిపారేస్తున్నాది'' అన్నాడు ఎంకట సామి

అప్పుడే వచ్చిన మల్లు ఈరావేశం ఎత్తిపోయేడు. ఎంకటసామిని ఎతుక్కుంటూ వచ్చేడు. వాడు దిగూ ఈదినుంచే వచ్చేడు. కుఱ్ఱాడేమో! వాడి వొళ్ళు కుతకుతాఉడికి పోతున్నాది. జెండా లొట్టుకొని ఊరేగింపు లెల్లినప్పుడల్లా వాడూ ఊరేగింపులకి వెళ్ళేడు. ఊరేగింపుల్లో ఆ బాబులనే మాటలు వాడికి కంఠతావే!

''ఈ కురుపులు పుట్టకురుపుల్రా! కోసిన జాగాలో మళ్ళీమళ్ళీ పుడుతూనే ఉంటాయి. ఈట్ని పుట్టకుండా సెయ్యాలంటే నాయాల! ఆటి మొదల్ని కొయ్యాల్రా! ఆటి మొదలు గుడిసెలు కాదురా! ఆటి కుదురు ఆ మేడలే! ఆకాశాన్నంటే మేడలే! చెక్కి పారేయాల్సింది గుడిసెల్ని కాదు! ఆ మేడల్నే పెరికించి పీకి పారెయ్యాల! సదును సేసి పారెయ్యాల! సాపుసేసి పారెయ్యాల! నాయాల! అప్పుడు పుట్టమన్నా పుట్ట కురుపులు పుట్టవు!''

''ఉత్తుత్తినే గావు కేకలు ఎట్టకొరే! మీటింగూ కాదు. ఊరేగింపూ కాదు. ఈరావేశం ఎత్తిపోతున్నావు'' అన్నాడు ఎంకటసామి

''ఈరావేశం ఎత్తినా పల్లకుండినా మన బతుకింతే. ఏ జలమలో ఏ పాపం సేసినావో!'' అన్నాది పోలి.

''పని నేదు. గెంజినీళ్ళు నేవు. గుడిసె కూడా నేకపోతే...'' అన్నాడు అప్పల కొండయ్య.

''ఊరుకుంటా మనుకున్నావేటి?'' అంటూ మల్లు మళ్ళీ ఏదో మొదలెట్ట బోయేడు.

''మేఘం ఎత్తినాది సల్లగాలి కొడ్తన్నాది. తొంగోండోరే! పెందిలికడే లెగిసి పెద్దబాబు కాడికెళ్ళి సెప్పుకుందాం'' అని లేచేడు ఎంకటసామి. ఎంకటసామితో పాటు మల్లూ లేచేడు.

''ఎంకటసామి! నీకు సెప్పనే నేదు. ఈ బింది సూసినావా?'' అన్నాది పోలి.

''కొత్త దాన్లా ఉన్నాదే''

''కొత్తదే! ఎంత సేస్తాదో సెప్పు''

''పదేడో పజ్జెనిమిదో ఉంటాది''

''అనాగయితే నాబమే'' అన్నాడు అప్పలకొండయ్య.

''కూలినేదు. గెంజినేదు అని ఏడుస్తూ సిలావరు బింది ఎనాకొన్నావు? కేడీ పని సెయ్యనేదు కదా!'' అన్నాడు ఎంకటసామి.

''సాసా! ఎదవపనులు ఎదవబుద్దులూ నేవు ఎంకటసామీ! ఈ పొద్దుదాకా పస్తు పడుంటున్నాదే కాని దొంగెదవ పన్లు సెయ్యనేదు. ఎప్పుడూ సెయ్యాసెయ్యను. పోలికి పార్వతొమ్మగోరు ఇచ్చినాదిట. నెల నెలా జీతంలో ఇరక్కొంటుకుంటానన్నాదిట. పది రూపాయలకే ఇచ్చినాది''.

''పది రూపాయలా! సవగ్గా దొరికినాది!'' అన్నాడు ఎంకటసామి

''ఆయమ్మ కేదో నాబం ఉండే ఉంటాది. నేపోతే ఆళ్ళా యిస్తారు! మెతుకు మెతుకూ నెక్కట్టు కుంటారు!'' అన్నాడు మల్లు.

''ఆయమ్మది కనికారపు బుద్దే'' అన్నాది పోలి.

''నాకు సెప్పమోకు. ఆళ్ళ కనికారపు బద్దులు నాకు బాగా తెల్సు'' అంటూ మల్లు వెళ్ళడానికి ఓ అడుగు వేసేడు. రివ్వుమంటూ చల్లటి గాలి కొట్టింది.

''పెద్ద గాలే నేచిందే! పదొరే! బేగి పదా!'' అంటూ ఎంకటసామీ మల్లూ వెళ్ళిపోయేరు.

రివ్వున వేసిన గాలికి కిర్సనాయిలు బుడ్డీ ఆరిపోయింది. ''తలుపు లాగి గట్టిగా నొక్కి పట్టుకుని గెడేసేడు అప్పల కొండయ్య.

''పెద్దోనే ముంచుకొస్తున్నాదే'' అంటూ పోలి బుడ్డీ మళ్ళీ వెలిగించింది.

''వోనడితే రేపూ సున్నావే. కూలి దొరకదు'' అన్నాడు అప్పలకొండడు.

''దిగాలు పడితే ఏటవుద్ది! ఎనా అవ్వాల్సుంటే అనా అవుద్ది. తొంగో''.

''దిగూ ఈదిలో అయ్యావోళ్ళూ ఎనా ఉన్నారో?'' అన్నాడు. అప్పలకొండయ్య.

''పెందిలకడనే ఎల్దుగాని తొంగో'' అన్నాది పోలి.

చంటాడి పక్కనే పడుకుని చీరకొంగు కప్పి వాణ్ణి తన దగ్గరగా లాక్కుంది. గోనెగుడ్డ కప్పుకుని ముడుచుకు పడుకున్నాడు అప్పలకొండయ్య.

హోరుమని గాలీవానా గుడిసెని ఊపుతున్నాయి. తాటేకు కమ్మల సందుల్లోంచి నీటి తుంపర్లు వొచ్చి పడుతున్నాయి. వెలిగించినంత సేపు పట్టలేదు. బుడ్డీ దీపం ఆరే పోయింది.

''ఒరి కొండయ్యా నెగరా నెగు! ఓలె పోలీ నెగవే! ముంపొచ్చి నాదిరా, ముంపు! నోకమంతా నెగిసి లగెత్తుతున్నారు! ఏటీ మొద్దు నిద్దరా నెగండిరా! లగెత్తండి. ముంపొచ్చినాది'' ఎవరో దబా దబా బాదేరు. కొండయ్య తుళ్లిపాటుతో లేచేడు.

తలుపు తీసి సూస్తే ఏటుంది? ఈది ఈదంతా పరుగులమీద ఉన్నాది. సీకట్లో పిల్లా పెద్దా సామాన్లు నెత్తి నెట్టుకుని పరిగెడుతున్నారు. ఎత్తి కుదేసి పడేస్తున్న గాలి. సీకట్లో ఏటీ కానరాటం నేదు. కళ్ళు నులుముకుని విషయం అర్థం చేసుకునే సరికి అప్పలకొండయ్యకి భయం వెన్ను పూసలోంచి జరజరా మీదకి పాకింది.

''ఓర్నాయినో! ఓలమ్మోయి!''

''ఒలే పోలీ! పోలీ'' అంటూ కేకలేసేడు. పోలి ఆసరికి లేచి గుమ్మంలో కొచ్చింది. దానికి ముంపొచ్చినట్టు బోధకాలేదు. వొరసం కురుస్తున్నాది. గాలి ఎత్తేస్తున్నాది ఆనే అనుకుంటున్నాది. బుడ్డీ దీపం వెలిగించినాది.

''ముంపొచ్చిందే పోలీ! ముంపు. బేగి బేగి పద! సామాన్లన్నీ గిరాటెయ్యి! సూడు సూడు అందరూ లగెత్తుతున్నారు.'' అప్పలకొండయ్య భయంతో గాభరాతో చేతికందిన సామాన్లని వీధిలో పడేసేడు. కుండా మండా, డబ్బాలు డొక్కులూ, చేటా చీపురూ, నులక మంచం అన్నీ పోలి అందిస్తూ ఉంటే తొందర తొందరగా లాక్కొచ్చేడు. మూటలు కట్టేరు.

''రాయే రా! బేగి బేగి'' అంటూ ఆయాసపడి పోయేడు. నులకమంచం తిరగేసి నెత్తిని పెట్టుకున్నాడు. దాని మీద మూటా ముల్లె, ట్రంకు పెట్టె పెట్టేడు.

''చంటోణ్ణి ఒట్టుకో నానోపాలి ఇంకేటన్నా మర్సిపోనానేమో, సూసేసొస్తా'' అన్నాది పోలి.

''ఇంకేటీ నేదు. లగెత్తవే లగెత్తు'' అంటూ చంటోణ్ణి చంకలోకి తీసుకున్నాడు.

''జర్మను సిల్వరు బిందిరోయి! కొత్త బింది ఉండిపోనాది''

''ఉండిపోతే పోనాది లగెత్తు. లగెత్తు పేనాలకన్నానా! లగెత్తు'' అప్పలకొండడు పరుగు లంకించుకున్నాడు.

వెనక్కి తిరిగి చూడకుండా ఒకటే పరుగు, కిందా మీదా కానరాని పరుగు. దారీ తెన్నూ తెలీని పరుగు, సీకట్లో గాల్లో వోనలో భయంలో పరుగు. పడుతూ లేస్తూ పరిగెట్టి అలుపొచ్చి–

''ఒలే పిల్లోణ్ణి ఒట్టుకో'' అని వెనక్కి నూసేడు పోలి నేదు.

''పోలీ! ఒలే పోలీ'' కేకలేస్తూ మళ్ళీ వెనక్కి పరుగు పెట్టబోయేడు.

''అదే వొస్తాదిలే. ఎనక్కి ఎలితే మరా రానేవు. పదొరే పదా!'' అంటూ పరిగెడుతున్న వాళ్ళు వాణ్ణి ముందుకే తోసేరు.

''పరిగెడుతున్న వోళ్ళలో పోలి ఉంటే ఉంటాది. నాకన్నా ముందలే వెళ్ళిపోనాదేమో'' అనుకున్నాడు.

ఊళ్లో అన్నిటికన్నా ఎత్తు జాగాలో ఉన్న పెద్దలోగిట్లో కంతా చేరుకున్నారు. ఒకర్నొకరు తోసుకుంటూ, కుమ్ముకుంటూ తమ వాళ్ళ కోసం తడుము లాడుకుంటూ! ఎవరు ఎవరో ఏమిటో తెలీటం లేదు.

అప్పలకొండయ్యకి పోలి కనపడలేదు. ''పోలిని సూసేవా! పోలిని సూసేవా?'' వెర్రివాడిలా అందర్నీ అడుగుతూనే ఉన్నాడు.

'దొంగేరు దొంగేరు' అని అండమే తెల్సుకాని పుట్టి బుద్ధి ఎరిగేక ముంపు రావడం చూడ్డం ఇదే! ముసిలోళ్ళు సెప్పే కబుర్లు తప్పించి ఏరు పొంగుతాది అన్న గేనమే ఎప్పుడూ నేదు? ఏటొడ్డున అన్నీ గుడిసెలే. గుడిసెల్లో వాళ్ళు ఏటికి దడిసి ఎప్పుడూ పరిగెట్టలేదు. బులుడోజరుకు భయపడి ఎలాగ ఎలాగ అని తర్జన భర్జనలు పడుతున్నారే తప్ప ఏరు వెంట పడుతుందని ఎవరూ కల్లో కూడా అనుకోలేదు.

అప్పలకొండయ్యకి పోలి కనపడలేదు. ఇంకే లోగిట్లోనన్నా తలదాచుకుందేమోనన్నారు.

''నా ఎనకే వొస్తున్నదనుకున్నాను. జర్మను సిలావరు బింది కొత్త బింది ఉండి పోనాది అన్నాది. పోతే పోనీ లగెత్తన్నాను. లగెత్తిందనే అనుకున్నాను. గుడిసెనోకి ఎల్లింది తిరిగి రానేదో ఏటో బగమంతుడా!'' అప్పలకొండయ్య ఆడదానిలా ఏడుస్తున్నాడు.

ఎంకటసామి, నర్సయ్య, మల్లు పట్టుకోలేక పోతున్నారు.

''ఒరూరుకోరా! ఊరుకో. ఏట్టైందో ఏటో తెల్దుగా. మల్లు ఎల్లి సూసొస్తాడు. ఊరుకోరా! ఒల్లకోరా?''

ఎంకటసామి ఇంటిది చంటివాణ్ణి తీసుకుంది.

''ఒరి కొండన్నా! ఏడవకురా ఏడకు! దిగూ ఈదినుండి మీ అయ్యా వోళ్లూ కోవఁటి గుప్తా గారింటి కాడ తల దాచుకున్నారుట మల్లు ఎల్లి పిలుసుకువొస్తాడు'' అని సముదాయించింది.

అప్పలకొండయ్య ఏడ్పు మానీసేడు. అందరివేపూ తేరిపారి చూసేడు. అందరూ భీతాహం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. కుండా మండా, మూటముల్లె, ముసిలివాళ్ళు, పిల్లలు అందరితో ఆ లోగిలంతా నిండిపోయి ఉంది. ఎవరో గెంజినీళ్ళు పోస్తున్నారు వొరస్సాగా నుంచుని దాకల్లో గెంజిపోయించుకుంటున్నారు. జుట్లు రేగిపోయి, కళ్ళు లోతుకుపోయి ఈడ్పుగొట్టు మొహాల్తో దేహీ అని చూస్తున్నారు.

''నరకం! నరకం!'' అన్నాడు అప్పలకొండయ్య.

''ఏట్రా కొండా! ఏటి!'' అని ఎంకటిసామి వాడి వీపు మీద చేత్తో రాస్తూ అడిగేడు.

''ఎంకటసామి! నరకం! నరకం ఎంకటసామీ'' అన్నాడు కొండయ్య.

''పోలి అంటే ఆడికి వొల్లమాలిన ప్రేమ. మతికాని చలించనేదు కదా!'' అన్నాడు నర్సయ్య.

నర్సయ్య మాటలకి అప్పలకొండయ్య గట్టిగా నవ్వేడు. అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

''నాకేటి మతి చలించనేదు. నిన్నరేత్తిరి పోలి ఏటన్నాది? నవ్వడమే మేలు. సస్తే సొరగమ్. బతికే నరకం అన్నాది. సత్తెంగా అన్నటు పోలి సొరగానికి ఎల్లిపోనాది. నాను బతికి పోనాను. నరకం కోసం బతికిపోనాను. ఆవు తోకట్టుకుని సొరగానికి ఎల్తారట! పోలి – నా పోలి జర్మను సిలావరు బింది బట్టుకొని సొరగానికి ఎల్లిపోనాది గుడిసెనేదనీ, గుడిసె పీకేసేరనీ, గంజి నేదనీ, కూలి నేదనీ, ఆకలేసి గుడ్లు తేలిపోతూ నరకంలో నాను పడుంటాను. ఒలే పోలీ! సెప్పినావు కావే! సొరగాని కెళ్తూ సెప్పినావు కావే! నీ కొంగొట్టుకుని వొచ్చేవోణ్ణి! నాకు సెప్పినావు కావే! ఇది నరకమ్! నరకమ్ ఇది'' అప్పలకొండయ్య వాగుడిని వింటూ అందరూ ఉలుకూ పలుకూ లేకుండా నిల్చుండిపోయారు.

*

చిరునామా :
డాక్టర్ చాగంటి తులసి
**5 – 127, పాల్ నగర్, మూడో వీధి,**
**విజయనగరం– 535 003,**
**సెల్ : 9963377672**

## కథాంతరంగం



వ్యవస్థ మన బతుకున్ని ఎలా నిర్ధారిస్తోందో మన స్వభావాలను ఎలా మారుస్తోందో తెలియ జెప్పే విధంగా విమర్శనాత్మక వాస్తవికతతో మానవ స్వభావ చిత్రీకరణ నా కథా రచన లక్ష్యం. అందుచేత క్యారెక్టర్ లోంచి కథా రచనకు సూత్రం అందుకోవడం జరుగుతుంది. నేను చూసిన ఏదో ఒక సంఘటన గానీ నాకు ఎదురుపడిన ఎవరో ఒక వ్యక్తినిగాని దృష్టిలో ఉంచుకొని కథ రాయడం అన్నది నా పద్ధతి కాదు. ఒకే రకమయిన అనేకానేక సంఘటనల నుండి నా కథకు కావలసిన సన్నివేశాలను కల్పించుకోవడం, ఎందరో వ్యక్తులు ఒకే రకమైన స్వభావాలను కట్టకట్టి పాత్రగా సృష్టించుకోవడం వల్ల సమాజ జీవితపు స్వరూప స్వభావాలు ఉబికి కనిపించడం జరుగుతుంది. చిన్న చిన్న టచ్చెస్‌తో క్యారక్టర్ల స్వభావాలను పోర్ట్రే చేయడంలో బాగా కృతకృత్యురాలనయ్యానన్న తృప్తి కలిగించిన కథ 'స్వర్గారోహణ'. ఈ కథ 1978లో రాసింది. వ్యవస్థ వల్ల ప్రాకృతిక వైపరీత్యాల వల్ల బతుకు నరకం అవుతున్న తీరు చెప్పడం జరిగింది. కథకి ఐరనీ, పేథాస్‌లు బలాన్నిచ్చాయి. సూటిగా చెప్పకుండా వ్యవస్థ క్రూరత్వాన్ని కథలోంచే ఐరనీ ద్వారా వెల్లడయ్యేట్టు చేస్తూ పాఠకులు కరుణతో స్పందించేటట్టు చెప్పగలిగాను.